సాక్షి అనంతపురం

ఆదివారం । 27 । జూలై । 2025



చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు పలికాయి.



టమాట కిలో రూ.34

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.34 పలికింది. కనిష్టం రూ.20, సరాసరి రూ.27 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

33.2°/ 22.6°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 15 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

అయ్యో పాపం.. ఇదేం ఘోరం

పేద పిల్లలపై మరీ ఇంత చిన్నచూపా

- 'సంక్షోభ' హాస్టళ్లుగా మారిన వసతి గృహాలు
- సరిపడా గదులు, బాత్‌రూములు లేవు
- ఆరుబయటే పిల్లల స్నానాలు
- సక్రమంగా అమలు కాని మెనూ
- ట్రంకు పెట్టెలు, బెడ్ షీట్లు అందించని కూటమి ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా దైన్యం

అనంతపురం రూరల్: జిల్లాలోని వసతి గృహాల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. బాలికల హాస్టళ్ల పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. వసతి గృహాల్లో మెనూ సక్రమంగా అమలు కావడం లేదు. ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల సాంబారుతోనే సరి పెడుతున్నారు. కనీసం తాగడానికి మంచి నీరు లేక పిల్లలు అల్లాడిపోతున్నారు. వేరే దారి లేక బోరు నీటితోనే దాహం తీర్చుకుంటున్నారు.

ఆరుబయటే స్నానాలు..

హాస్టళ్లలో విద్యార్థులకు సరిపడా గదులు, మరుగుదొడ్లు లేక పోవడం పెద్ద సమస్యగా మారింది. ఆరుబయటే చన్నీళ్ల స్నానం చేస్తున్నారు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి కొన్ని చోట్ల బహిర్భూమికి వెళ్తున్నారు.చాలా చోట్ల హాస్టళ్లకు ప్రహరీలు లేకపోవడం, గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో పిల్లలకు రక్షణ లేకుండా పోతోంది. రాత్రీ,పగలు తేడా లేకుండా విష సర్పాల సంచారంతో వణికిపోతున్నారు.

అందని ట్రంకు పెట్టెలు, బెడ్ షీట్లు..

గత ఏడాది నుంచి వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ట్రంకు పెట్టెలు, బెడ్ షీట్లు, నోట్ బుక్‌లు అందించిన దాఖలాలు లేవు. బెడ్‌షీట్లు లేక రాత్రిళ్లు చలికి వణుకుతూ, దోమల స్వైరవిహారం నడుమ ఇబ్బందులు పడుతూనే నిద్రపోవాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడంతో విద్యార్థులు సొంత డబ్బు వెచ్చించి పెట్టెలు, బెడ్‌షీట్లు తెచ్చుకుంటున్నారు. ఇక.. ప్రభుత్వ బడుల్లో ఇచ్చిన బ్యాగులు నాసిరకంగా ఉండి కొన్ని రోజులకే తెగిపోవడంతో పుస్తకాలు మోసుకెళ్లలేక వారు పడుతున్న బాధలు అన్నీ ఇన్నీ కావు.

గతం వైభవం.. నేడు అధ్వానం..

2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతోనే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ వసతి గృహాల రూపురేఖల్ని మార్చేశారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించడానికి మెనూలో సమూల మార్పులు తీసుకొచ్చారు. డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచి క్రమం తప్పకుండా అందించారు. ప్రభుత్వ పాఠశాలల తరహాలోనే వసతి గృహాల్లో సైతం నాడు–నేడు పనులకు శ్రీకారం చుట్టారు. విద్యార్థులకు ఇబ్బందులు ఉండకూడదన్న ఉద్దేశంతో జిల్లా, మండల స్థాయి అధికారుల బృందం వసతి గృహాల్లో పర్యటించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. గతంలో మాదిరి అధికారుల బృందాలు వసతి గృహాల్లో తనిఖీలు చేపట్టకపోవడంతో వార్డెన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. హాస్టళ్లలో విద్యార్థుల భద్రతపై న్యాయ స్థానాలు సైతం ప్రశ్నిస్తున్నా ప్రభుత్వంలో మార్పు రావడం లేదు.

భద్రత గాల్లో..

అనంతపురంలో బీసీ సంక్షేమశాఖ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న బీసీ బాలుర జూనియర్ కళాశాల హాస్టల్‌లో చేరిన తేజా అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడడం కొన్ని రోజుల క్రితం సంచలనం సృష్టించింది. వసతి గృహంలో మౌలిక వసతులు లేక, అక్కడ ఉండలేక, ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పుకోలేక నలిగిపోయి బాత్‌రూమ్‌లోనే టవల్‌తో ఉరి వేసుకోవడం కలచివేసింది. ఇది జరిగిన కొన్ని రోజులకే నగరంలో జీసస్‌నగర్‌లో ఉన్న బీసీ బాలికల జూనియర్ కళాశాల వసతి గృహంలో ఇంటర్ చదువుతున్న ఓ బాలిక హాస్టల్ నుంచి బయటికి వెళ్లి హత్యకు గురైంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువై వార్డెన్లు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి.



అపరిశుభ్రంగా అనంతపురం జూనియర్ కళాశాల ప్రాంగణంలోని బీసీ హాస్టల్

ముగ్గురు మంత్రులున్నా..

ఉమ్మడి జిల్లా నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన ముగ్గురు ప్రస్తుతం చంద్రబాబు కేబినెట్‌లో ఉన్నారు. అయినా, హాస్టళ్ల గురించి, పేద పిల్లలు పడుతున్న ఇబ్బందుల గురించి పట్టనట్లే ఉంటున్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా సవిత ఉన్నా ప్రయోజనం కానరావడం లేదు. మంత్రుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



బీసీ హాస్టల్‌లో డోర్‌లేని బాత్‌రూం

అనంతపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని బీసీ వసతి గృహంలో విద్యార్థులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. పిల్లలకు సరిపడా మరుగుదొడ్లు లేవు. ఉన్న వాటికి తలుపులు కూడా సరిగా లేవు. బకెట్లు అడ్డు పెట్టుకొని మరుగుదొడ్లకు వెళ్లాల్సిన దుస్థితి. వసతి గృహం పరిసరాల్లో పందులు, పశువులు సంచరిస్తుండడంతో కంపు కొడుతోంది.. ఈ ఒక్కటే కాదు జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని సంక్షేమ వసతి గృహాల్లో ఇలాంటి ఘోర పరిస్థితులే నెలకొన్నాయి.

జిల్లాలోని హాస్టళ్ల వివరాలు..

సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాలు	51
విద్యార్థులు దాదాపు	6 వేలు
బీసీ సంక్షేమశాఖ వసతి గృహాలు	55
విద్యార్థులు	8 వేలు
ఎస్సీ హాస్టళ్లు	11
విద్యార్థులు	1,700



బుక్కరాయసముద్రం ఎస్టీ గురుకుల పాఠశాలలో ఆరుబయటే స్నానం చేస్తున్న విద్యార్థులు



బుక్కరాయసముద్రం ఎస్సీ హాస్టల్‌లో అధ్వానంగా మారిన వంటగది పరిసరాలు



కాలకృత్యాలు తీర్చుకునేందుకు బహిర్భూమికి వెళ్తున్న తాడిపత్రి మండలం చుక్కలూరు ఎస్సీ హాస్టల్ విద్యార్థులు



బ్రహ్మసముద్రం ఎస్సీ హాస్టల్‌లో ఇరుకు గదిలో విద్యార్థుల అవస్థలు.. (వీరికి బెడ్‌షీట్లు కూడా ప్రభుత్వం అందించలేదు)



ఉరవకొండ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో పైకప్పు పెచ్చులూడిన డైనింగ్ హాలులో భోజనం చేస్తున్న విద్యార్థినులు



శింగనమల ఎస్సీ బాలుర వసతి గృహం వద్ద దెబ్బతిన్న కాంపౌండ్, అధ్వానంగా హాస్టల్ పరిసరాలు

న్యూస్‌రీల్

జస్టిస్ సురేష్ రెడ్డికి ఘన స్వాగతం



న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. సురేష్ రెడ్డికి అధికారులు ఘన స్వాగతం పలికారు. స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో శనివారం జస్టిస్ సురేష్ రెడ్డిని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు.

రేపు కలెక్టరేట్‌లో 'పరిష్కార వేదిక'

అనంతపురం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈనెల 28వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తెలిపారు. రెవెన్యూ భవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు సమర్పించాలని సూచించారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలన్నారు. సమర్పించిన అర్జీల స్థితిని కాల్‌సెంటర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ప్రజలు అర్జీలను meekosam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ సమర్పించవచ్చని తెలిపారు.

వృద్ధులు, నిస్సహాయకులకు ఇంటి వద్దే రేషన్ పంపిణీ

అనంతపురం అర్బన్: 65 ఏళ్లపైబడిన వృద్ధులు, దివ్యాంగులు, నిస్సహాయులకు వారి ఇళ్ల వద్దకే డీలర్లు వెళ్లి రేషన్ పంపిణీ చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. డీలర్లు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా లేదా అని అధికారులు తనిఖీ చేయాలన్నారు. శనివారం స్థానిక నాయక్‌నగర్‌లోని 37వ చౌక ధరల దుకాణం పరిధిలోని వృద్ధుల ఇళ్లవద్దకు ఇన్‌చార్జ్ కలెక్టర్ వెళ్లి బియ్యం, సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 31లోపు చౌక దుకాణాల పరిధిలో బియ్యం కార్డులున్న వృద్ధులు, దివ్యాంగులు, నిస్సహాయులకు రేషన్ అందించాలని చెప్పారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధతో క్షేత్రస్థాయిలో పర్యటించి పంపిణీ ప్రక్రియ సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ డీఎం రమేష్‌రెడ్డి, తహసీల్దారు హరికుమార్, సీఎస్‌డీటీ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలను సద్వినియోగం చేసుకోండి



పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా 2025- 26 విద్యా సంవత్సరంలో పదోతరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ కోరారు. చదువు మధ్యలో ఆపేసిన వారికి, ఏవైనా పనులు చేసుకుంటున్న వారు, ఉద్యోగాలు చేసుకుంటూ రెగ్యులర్‌గా పాఠశాల, కళాశాలలకు వెళ్లలేని వారికి ఇదో మంచి అవకాశమన్నారు.ప్రచారంలో భాగంగా శనివారం గృహ నిర్మాణ శాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శైలజ, మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి జి. రామసుబ్బారెడ్డి, అంబేడ్కర్ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయ అధికారి జయలక్ష్మి, బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూ కొఠారి చేతుల మీదుగా వారివారి కార్యాలయాల్లో ఓపెన్ స్కూల్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అలాగే కరపత్రాలు పంపిణీ చేశారు.

జిల్లాకు 594 మెట్రిక్ టన్నుల ఎరువులు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాకు మాధవన్ కంపెనీకి చెందిన 594 మెట్రిక్ టన్నుల ఎరువులు చేరినట్లు రేక్ అధికారి, ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో 24-24-0-3-0 రకం 248 మెట్రిక్ టన్నులు, 24-24-0 రకం 282 మెట్రిక్ టన్నులు, 20-20-0-13 రకం 64 మెట్రిక్ టన్నులు సరఫరా అయిందని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఇండెంట్ మేరకు ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు.

పాఠశాలలో పెచ్చులూడి విద్యార్థులకు తీవ్ర గాయాలు

గుంతకల్లుటౌన్: స్థానిక ఆలూరు రోడ్డులోని సెయింట్ పాల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శనివారం మధ్యాహ్నం తరగతి గది పైకప్పు పెచ్చులూడి పడి 7వ తరగతి చదువుతున్న ఓంకార్, స్టీఫెన్‌జాయ్ అనే విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. తలకు తీవ్ర గాయాలైన ఇద్దరినీ ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ మస్తాన్‌రావు విద్యార్థులు చికిత్స పొందుతున్న ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అనంతరం ప్రమాదం జరిగిన తరగతి గదిని ఆయన పరిశీలించారు. ఎంఈఓ మస్తాన్‌రావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం అనంతరం ఏడో తరగతి గదిలో క్లాసులు జరుగుతుండగా పైకప్పు పెచ్చులూడి పడిందన్నారు. దీంతో విద్యార్థుల తలకు బలమైన గాయాలయ్యాయన్నారు. ఇద్దరికీ తలకు కుట్లు పడ్డాయని చెప్పారు. పాఠశాల కరస్పాండెంట్ అందుబాటులో లేరని, సోమవారం మరోసారి పాఠశాలను తనిఖీ చేసి జరిగిన ఘటనపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు పంపుతానని పేర్కొన్నారు. ఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు.



గాయాలపాలైన ఇద్దరు విద్యార్థులు


అధికారుల కనుసన్నల్లోనే 'ఉపాధి' అక్రమాలు

బుక్కరాయసముద్రం: మండలంలో 'ఉపాధి' అధికారుల కనుసన్నల్లోనే అక్రమాలు జరుగుతున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధి హామీ పథకంలో అవినీతి అక్రమాలు పెరిగిపోయాయన్నారు. ఉపాధి కూలీలు పనులకు రాకున్నా వారి పేరున ఫీల్డ్ అసిస్టెంట్లుగా ఉన్న టీడీపీ కార్యకర్తలు బిల్లులు రాసుకుంటున్నారని ఆరోపించారు. కూలీల వద్ద వారం వారం డబ్బు వసూలు చేస్తూ దందాకు తెర లేపారన్నారు.అధికారుల కనుసన్నల్లోనే అక్రమాలు జరుతున్నాయని, ఎంపీడీఓ,ఏపీఓ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బీకేఎస్‌లో జాబ్ కార్డుల పంపకాల్లో తేడాలు వచ్చి ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు దాడులు చేసుకుంటున్నారన్నారు. ఉపాధి అక్రమాలను అరికట్టకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నరేష్, చంద్ర, బయపరెడ్డి, రంగా, నాగరాజు, నాగ, సాకే లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తుంగభద్రమ్మ ఉగ్రరూపం



ఉరకలెత్తుతూ నదికి పోతున్న తుంగభద్ర జలాలు

బొమ్మనహాళ్: తుంగభద్రమ్మ ఉగ్రరూపం దాల్చింది. టీబీ డ్యాంకు వరద పోటెత్తింది. జలాశయానికి ఎగువన ఉన్న తుంగ డ్యాం నుంచి 70 వేల క్యూసెక్కులు, భద్ర డ్యాం నుంచి 20 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయగా.. ఇదే క్రమంలో పరివాహక ప్రాంతాల్లో వర్షం భారీగా కురవడంతో వరద ఉరకలెత్తుతూ డ్యాంకు చేరుతోంది. ఈ క్రమంలో టీబీ బోర్డు అధికారులు డ్యాం గేట్లన్నీ తెరిచి లక్ష క్యూసెక్కుల నీటిని నదికి వదిలేస్తున్నారు. నీటి విడుదల నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతాల గ్రామాలకు హెచ్చరికలు జారీ చేశారు. నది వైపు రైతులు, జాలర్లు, మత్స్యకారులు వెళ్లరాదని సూచించారు. తుంగభద్ర జలాశయంలో 1,633 అడుగులకు గాను ప్రస్తుతం నీటి నిల్వ 1,625.43 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, డ్యాం 19వ గేటు సరిగా లేని కారణంగా దాన్ని కుదించారు. 80 టీఎంసీలు నిల్వ చేసి మిగిలిన నీరు నదికి విడుదల చేస్తున్నారు. 19వ గేటు మినహా అన్ని గేట్లు తెరిచి నీటిని నదికి వదులుతున్నారు.

కసాపురంలో శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభం



స్వర్ణకవచ అలంకరణలో దర్శనమిస్తున్న నెట్టికంటి ఆంజనేయస్వామి వారు



స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

గుంతకల్లు రూరల్: కోరిన కోర్కెలు తీర్చే పెన్నిధిగా, భక్తుల కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందిన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో శనివారం శ్రావణమాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామివారి దర్శనార్థం భారీ ఎత్తున తరలివచ్చిన భక్తులతో ఆలయ పురవీధులు పోటెత్తాయి. శోభాయమానంగా విరాజిల్లుతూ భక్తులకు దర్శనమిస్తున్న నెట్టికంటుడి సేవలో భక్తులు తరించారు. స్వామివారి నామస్మరణతో ఆలయ పుర వీధులు మార్మోగాయి. శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా సీతారామలక్ష్మణులతో కలిసి ఆంజనేయస్వామి వారు శేషవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం వేకువజామునే అర్చకులు స్వామివారి మూల విరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని స్వర్ణ కవచ అలంకరణ, ప్రత్యేక పుష్పాలతో అందంగా అలంకరించి పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్లను శేషవాహనంపై కొలువుదీర్చి అందంగా అలంకరించారు. ఆలయ ఈఓ కే.వాణి, ధర్మకర్త సుగుణమ్మ ఆధ్వర్యంలో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేసి ప్రాకారోత్సవం నిర్వహించారు. శేషవాహనంపై కొలువుదీరిన స్వామివార్లు ఆలయం చుట్టూ ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు చేపట్టారు.

క్లుప్తంగా

సైనికుల త్యాగం స్ఫూర్తిదాయకం



జాతీయ జెండాతో ర్యాలీ..

గుంతకల్లు: భారత సైనికుల త్యాగం, ధైర్యం నేటితరానికి స్ఫూర్తిదాయకమని వన్‌టౌన్ సీఐ మనోహర్, లయన్స్ క్లబ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఖాజా గరీబ్ నవాజ్, మహేష్‌రాజు పేర్కొన్నారు. శనివారం కార్గిల్ దివస్ సందర్భంగా దాదాపు 500 మీటర్ల జాతీయ జెండాను గుంతకల్లు పురవీధుల్లో భారీ ర్యాలీతో ఊరేగించారు. ఈ సందర్భంగా రైల్వే గ్రౌండ్‌లో ఏర్పాటు సమావేశంలో పలువురు వీరసైనికులను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతదేశ బలానికి, సహనానికి కార్గిల్ విజయగాథ నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కోశాధికారి బాలాజీ, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ ఇల్లూరు గోపాలకృష్ణ, మెంబర్లు రాము, రంగస్వామి, జగన్నాథ్, దినేష్, విజయ్‌బాస్కర్, రవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వీరసైనికున్ని సన్మానిస్తున్న దృశ్యం

గుప్తనిధుల వేటగాళ్ల అరెస్ట్

కళ్యాణదుర్గం రూరల్: కుందుర్పి మండలం రుద్రంపల్లి సమీపంలో మల్లప్ప ఆలయంలో శుక్రవారం 12 మంది వ్యక్తులు గుప్త నిధుల కోసం యంత్రాలతో తవ్వుతుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ నీలకంటేశ్వర్, ఎస్‌ఐ నగేష్ మీడియాకు వెల్లడించారు. నిందితుల్లో బోయ నాగభూషణ, బొమ్మన్న, మంజునాథ్, సయ్యద్ అష్రఫ్, తలారి సుబ్బరాయుడు, వెంకటేష్, నజీముద్దీన్, ఫసుదీన్, నౌషాద్, షేక్ ఫరూక్, షేక్ షఫీ, మొహమ్మద్ ఉన్నారు. వీరి నుంచి ఒక జేసీబీ, రెండు కార్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు, సంఘటన స్థలంలో లభ్యమైన ఇత్తడి వస్తువులు స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారీలో ఉన్న మరో ముగ్గురు నిందితుల కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

ఆదాయం కోసం అడ్డదారులు



- అక్రమాలకు నిలయంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు
- డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్నా కానులు ఇవ్వాల్సిందే
- టీడీపీ నేతల కనుసన్నల్లో పని చేస్తున్న అధికారులు
- ఉమ్మడి జిల్లాలో భారీగా అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లు
- రూ.లక్షల్లో దండుకుంటున్న సబ్ రిజిస్ట్రార్లు

☛ శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేస్తున్న ఓ ఎస్ఆర్‌ఓకు అవినీతి అధికారిగా పేరుంది. గతంలో కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న సమయంలో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. క్రయ, విక్రయదారులు లేకుండానే థర్డ్ పార్టీ వ్యక్తులతో కుమ్మక్కై భారీస్థాయిలో డబ్బులు దండుకొని గతంలో రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్‌ను రద్దు చేశారు. దీనిపై ఫిర్యాదు రావడంతో.. కిందిస్థాయి ఉద్యోగులపై తప్పును నెట్టారు. ఉన్నతాధికారులు మరోమారు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి సబ్ రిజిస్ట్రార్ పాత్ర ఉందంటూ నివేదిక ఇవ్వడంతో సస్పెండయ్యారు. ప్రస్తుతం బుక్కపట్నంలో సైతం అదే పంథాలో విధులు నిర్వర్తిస్తున్నారు. టీడీపీ నేతల అండతో పెద్ద ఎత్తున అసైన్డ్, ప్రభుత్వ భూములు రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలుస్తోంది.

అనంతపురం టౌన్: ఉమ్మడి జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అక్రమాలకు నిలయాలుగా మారాయి. క్రయవిక్రయాలకు సంబంధించి డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేయాలంటే అధికారులకు చేయి తడపాల్సిందే. లేదంటే కొర్రీలు వేసి రిజిస్ట్రేషన్లు కాకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారు. అనంతపురం జిల్లాలో 12, శ్రీసత్యసాయి జిల్లాలో 9 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఈ కార్యాలయాలు ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకుల కనుసన్నల్లో నడుస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వారు చెబితే ఎలాంటి భూములకైనా రిజిస్ట్రేషన్లు చేస్తారు. వారి ఆజ్ఞ లేకుంటే పట్టా భూములను సైతం రిజిస్ట్రేషన్ చేయకుండా కొర్రీలు చూపుతారు. ఇటీవల చిలమత్తూరులో సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తూ ఇటీవలే కదిరికి బదిలీపై వెళ్లిన ఓ సబ్ రిజిస్ట్రార్ పెద్ద మొత్తంలో డబ్బు దండుకుని చిలమత్తూరు పరిధిలో ఓ ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేశారు. ఈ విషయం కాస్తా పార్లమెంట్ స్థాయి ప్రజాప్రతినిధి దృష్టికి వెళ్లడంతో ఆయన రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆగమేఘాలపై ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేశారు. ధర్మవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఫ్రీ హోల్డ్ భూములను అక్కడి సబ్ రిజిస్ట్రార్ పెద్ద మొత్తంలో డబ్బు తీసుకుని రిజిస్ట్రేషన్లు చేశారు. కూడేరు మండలం కమ్మూరులో డైక్లాట్‌లో రోడ్డుగా ఉన్న 5 ఎకరాల స్థలాన్ని ఏడాది క్రితం ఓ సబ్ రిజిస్ట్రార్ భారీగా ముడుపులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేశారు. ప్రస్తుతం ఆ రోడ్డు స్థలంలో ఓ వెంచర్ వెలిసిందంటే ఏ స్థాయిలో అక్రమాలు జరుగుతున్నాయో స్పష్టంగా అర్థం అవుతోంది.

భూ యజమానులపైనే కేసులు..

అనంతపురం రూరల్ పరిధిలోని కక్కలపల్లి పొలం రుద్రంపేట పరిధిలో అత్యంత విలువైన 5 ఎకరాల పొలం లావాదేవీలపై భూ యజమానులు కోర్టులో దావా వేశారు. కోర్టులో దావా నడుస్తున్న ఆ భూమిని ఓ మిల్క్ డెయిరీ నిర్వాహకుడు కొనుగోలు చేశాడు. డెయిరీ నిర్వాహకునితో రూరల్, అనంతపురం రామ్‌నగర్ కార్యాలయాల్లో పని చేస్తున్న సబ్ రిజిస్ట్రార్లు కుమ్మక్కై రూ.లక్షల్లో డబ్బులు తీసుకొని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు. బాధిత భూయజమానులు రామ్‌నగర్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తే.. విధులకు ఆటంకం కలిగించారని వారిపైనే పోలీస్ స్టేషన్‌లో అధికారులు ఫిర్యాదు చేయడం గమనార్హం.

నామమాత్రంగా ఏసీబీ దాడులు..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఏసీబీ అధికారులు ఏడాదికి, రెండేళ్లకోసారి నామమాత్రంగా దాడులు నిర్వహిస్తున్నారు. గడిచిన ఆరేళ్లలో కేవలం మూడు సార్లు మాత్రమే రిజిస్ట్రేషన్ కార్యాలయాలపై దాడులు నిర్వహించారు. అనంతపురం రామ్‌నగర్ కార్యాలయంలో పని చేస్తున్న సబ్ రిజిస్ట్రారు సత్యనారాయణపై ఏసీబీ దాడులు నిర్వహించి కేసు నమోదు చేశారు. బుక్కపట్నంలో ఎస్ఆర్‌ఓ శ్రీనివాసులు ఏడాది క్రితం లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే ఆయన ఏసీబీ అధికారుల నుంచి తప్పించుకొని చెన్నై వెళ్లి అక్కడ ఓ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. తాజాగా కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామి రూ.5లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు



సబ్ రిజిస్ట్రార్లు అక్రమాలకు పాల్పడితే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. సబ్ రిజిస్ట్రార్లు ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే విధంగా వ్యవహరించాలి. ప్రభుత్వ ఆదాయానికి తూట్లు పొడిస్తే సహించేది లేదు. కళ్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్‌పై ఏసీబీ దాడుల నివేదిక ఇంకా రాలేదు. వచ్చిన వెంటనే తదుపరి చర్యలు తీసుకుంటాం. – విజయలక్ష్మి, డీఐజీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, అనంతపురం

బదిలీ టీచర్లకు వెంటనే జీతాలు చెల్లించాలి



నిరసన తెలియజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం డీఈఓ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి ఉపాధ్యాయులు బోధనకంటే బోధనేతర పనులకే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోందన్నారు. యోగాంధ్ర, మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం, శిక్షణ తరగతులు పేరుతో బోధనకు దూరం చేస్తున్నారన్నారు. ఇవి కాకుండా రోజూ ఏదో ఒక సమాచారం అడుగుతున్నారని, అత్యవసరమంటూ యాప్‌లలో అప్‌లోడ్ చేయాలంటూ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేస్తోందన్నారు. విద్యా కిట్ల పంపిణీ అప్‌లోడ్ చేయాలంటూ ఒత్తిళ్లు చేస్తున్నారన్నారు. ఇవికాకుండా ఉపాధ్యాయులకు ఏ మాత్రం సంబంధంలేని పీ-4 వంటి కార్యక్రమాలను కూడా అప్పగిస్తున్నారన్నారు. యాప్‌ల భారం తగ్గిస్తామని చెబుతూనే ఒకే యాప్‌లో అనేక సమాచారాలు పెట్టమంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బదిలీలు జరిగి నెలరోజులు గడచినా ఇప్పటికీ వేలాదిమంది ఉపాధ్యాయులు రిలీవింగ్‌కు నోచుకోలేదన్నారు. పేరుకు ఐదుగురు టీచర్లను ఇచ్చినా చాలా పాఠశాలల్లో ఇద్దరే పని చేస్తున్నారన్నారు. వారిపై బోధనా భారం ఎక్కువగా ఉందన్నారు. బదిలీ అయిన టీచర్లకు జీతాలు అందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రమణయ్య, సరళ, సుబ్బరాయుడు, చంద్రమోహన్, నాగేంద్ర, శ్రీనివాసులు, ఆదిశేషయ్య, సుభాషిణి, శ్రీకాంత్, సంపత్ కుమార్ పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్

అనంతపురం ఎడ్యుకేషన్: టీచర్ల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని ఉపాధ్యాయ భవనంలో ఏపీటీఎఫ్ జిల్లా శాఖ సబ్ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర కార్యదర్శి పాతిరెడ్డి, జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, రాష్ట్ర పూర్వ కార్యదర్శి నరసింహులు మాట్లాడారు. ముందుచూపు లేకుండా ఉపాధ్యాయ బదిలీలు నిర్వహించడంతో బదిలీ అయిన టీచర్లకు నేటికీ జూన్ నెల జీతాలు రాలేదన్నారు. జూలై నెల జీతం కూడా క్లెయిమ్ చేసే పరిస్థితుల్లో ప్రభుత్వం లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఇంటి అద్దెలు కట్టలేక నెలసరి ఖర్చులు భరించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారన్నారు. తక్షణమే జీతాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఉపయోగిస్తూ విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారన్నారు. తదుపరి జరిగే నష్టాలకు ఉపాధ్యాయులనే బాధ్యులు చేయాలని ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ సబ్ కమిటీ సభ్యులు దేశాయి నాగరాజు, మోహన్‌రెడ్డి, భాస్కర్, నరేష్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్దార్ వలి పాల్గొన్నారు.

వ్యక్తిపై వేట కొడవలితో దాడి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మధు

గుంతకల్లు రూరల్: పొలం రస్తా వివాదంలో గుర్రబ్బాడు గ్రామానికి చెందిన మధు అనే వ్యక్తిపై శనివారం అదే గ్రామానికి చెందిన గోవిందు అతడి కుటుంబ సభ్యులు వేట కొడవలితో దాడి చేశారు. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... గుర్రబ్బాడు గ్రామానికి చెందిన కదిరప్ప, ప్రమీలమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు సుధీర్ పేరున నాలుగు సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన బాలిరెడ్డి అనే రైతు వద్ద నుంచి 1.48 ఎకరాల పొలాన్ని కొనుగోలు చేశారు. పక్క పొలం రైతు అయిన గోవిందుతో ఆరోజు నుంచి రస్తా వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో శనివారం కదిరప్ప భార్య ప్రమీలమ్మ, పెద్ద కుమారుడు సూర్యనంద, అతడి భార్య హేమలతలు వారి పొలంలో కందిపంట సాగు చేయడానికి వెళ్లారు. అప్పటికే పక్క పొలంలో వ్యవసాయం చేసుకుంటున్న గోవిందు, అతడి భార్య రామాంజినమ్మ, కుమారులు రాజమోహన్, అజయ్‌కుమార్‌లు 'మీ పొలానికి రస్తా లేదం'టూ వారిని అడ్డుకున్నారు. మాటామాటా పెరగడంతో గోవిందు అతడి కుమారులు ప్రమీలమ్మతోపాటు, కొడుకు, కోడలును కొట్టి ఇంటికి పంపారు. విషయం తెలుసుకున్న కదిరప్ప రెండో కుమారుడు మధు వారిని వెంటబెట్టుకొని మరోసారి పొలానికి వెళ్లాడు. రస్తా సమస్యపై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో మధుపై వేటకొడవలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడిని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

లడ్డూలో నాణ్యత ఎంత?

- నేమకల్లులో అనధికారిక విక్రయాలు
- ఇష్టమొచ్చిన ధరలతో భక్తుల జేబులకు చిల్లు
- పట్టించుకోని దేవదాయ శాఖ అధికారులు



నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో అక్రమంగా లడ్డూలను విక్రయిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: శ్రావణ మాసంలో శని, మంగళవారాల్లో నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ప్రసాదంగా లడ్డూలు కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. ఇక్కడ బయటి ప్రాంతాల నుంచి ఇబ్బడి ముబ్బడిగా తెప్పించిన లడ్డూలను ఎవరికి తోచినట్టు వారు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అధికారుల అండదండలతోనే ఇలా సాగిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. శుచి–శుభ్రతతో రుచికరంగా తయారు చేసిన లడ్డూ ప్రసాదాన్ని భక్తులు పరమ పవిత్రంగా భావిస్తారు. అలాంటి లడ్డూ విక్రయాల కోసం ఆలయ అధికారులు దేవదాయ శాఖ అనుమతి తీసుకుని వేలం పాట నిర్వహించాలి. వేలం దక్కించుకున్న వారు ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అధికారులు నాణ్యతను పరిశీలించిన తర్వాత లడ్డూలను విక్రయించాల్సి ఉంటుంది. అలా కాకుండా బయట నుంచి లడ్డూలు తెప్పించి భక్తులకు ప్రసాదం పేరుతో అమ్ముతున్నారు. రెండు చిన్న సైజు లడ్డూలు రూ.50 నుంచి రూ.100కు విక్రయిస్తున్నారు. ప్రసాదంతో పాటు స్వామి ఫొటోలను ఎవరు పడితే వారు.. ఎంత పడితే అంత ధరలకు విక్రయిస్తున్నా అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి లడ్డూ ప్రసాద ప్రాశస్త్యం, పవిత్రతకు భంగం వాటిల్లకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

అనగనగా ఓ బిహారి!

- నాలుగు నెలలుగా జీజీహెచ్ వార్డులోనే ఆశ్రయం
- యువతి సంబంధీకుల ఆచూకీ తెలియని వైనం
- భద్రత దృష్ట్యా వార్డులోనే ఉంచిన సర్జరీ విభాగం వైద్యులు





సర్జరీ విభాగంలోని ఎఫ్ఎస్-2లో ఉన్న జ్ఞాని

అనంతపురం మెడికల్: ఊరుకాని ఊరు... నా అనుకున్న వారు ఉన్నారో లేదో కూడా తెలీదు. కాలిన గాయాలు మానినా.. బిక్కుబిక్కుమంటూ జీజీహెచ్‌లోనే దోకాడుకుంటూ తిరుగుతోంది ఓ అభాగ్యురాలు. హిందీలో మాట్లాడితే.. తనకెవరూ లేరని సమాధానం ఇస్తోంది. కాస్త టీ ఇప్పించండి, ఆకలిగా ఉందంటూ అటు వెళ్తున్న వారిని పలకరిస్తూ దీనస్థితిలో వేడుకుంటోంది. వివరాల్లోకి వెళితే.. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని సర్జరీ విభాగంలో 30 ఏళ్ల వయసున్న బిహార్‌కు చెందిన జ్ఞాని ఉంటోంది. ఈ ఏడాది మార్చి 24న రైలులో ప్రయాణిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై 50 నుంచి 60 శాతం కాలిన గాయాలతో ఆస్పత్రికి చేరింది. అందరూ బతకదనుకున్నారు. అయితే సర్జరీ వైద్యులు, స్టాఫ్‌నర్సులు వైద్యం అందించి ఆమెకు ఊపిరి పోశారు. కోలుకున్న తర్వాత తన వారి గురించి అడిగితే 'పతా నహీ' అంటూ సమాధానం ఇస్తోంది. దీంతో ఆమెను ఎక్కడికి పంపాలో తెలియని అయోమయంలో వైద్యులు పడ్డారు. మహిళలకు భద్రత లేని ప్రస్తుత రోజుల్లో ఆమెను బయటకు పంపిస్తే ఎలాంటి ఆపదలో పడుతుందోననే ఆందోళన వైద్యులు, నర్సుల్లో నెలకొంది. దీంతో మానవతా దృక్పథంతో ఆలోచించి సర్జరీ విభాగంలోనే ఆమెకు ఆశ్రయం కల్పించారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు సర్జరీ విభాగం వైద్యులు, నర్సులను అభినందిస్తున్నారు.

పోలీసు, రైల్వే జట్ల విజయం

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్, ఏపీ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఉద్యోగుల క్రికెట్ టోర్నమెంట్ ప్రీ-క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం ఆర్డీటీ స్టేడియంలో జరిగింది. అనంతపురం ఆర్టీసీ జట్టుతో జరిగిన పోటీలో అనంతపురం పోలీస్ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం పోలీస్ జట్టు 20 ఓవర్లలో 237 పరుగుల భారీ స్కోరు సాధించింది. పోలీస్ జట్టులో రాఘవేంద్ర 52 పరుగులతో ఆకట్టుకున్నాడు. అనంతరం ఆర్టీసీ జట్టు 20 ఓవర్లలో 125 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది.

❑ ఆర్డీటీ బీ గ్రౌండ్‌లో ధర్మవరం మునిసిపాలిటీ, రైల్వే యూఎఫ్ఎస్‌డీ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ధర్మవరం మున్సిపాలిటీ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 136 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. లోకేశ్ 44 బంతుల్లో 9 ఫోర్లతో అర్ధసెంచరీ సాధించాడు. రైల్వే జట్టు 11 ఓవర్లలోనే 137 పరుగుల లక్ష్యాన్ని సాధించింది. గణేష్ 37 బంతుల్లో 71 పరుగులు (5 సిక్సర్లు, 7 ఫోర్లు) చేసి జట్టుకు సునాయసంగా విజయాన్ని అందించాడు.

మచ్చా దత్తారెడ్డి మెరుపు సెంచరీ

- ప్రాబబుల్స్ పోటీల్లో సత్తా



మచ్చా దత్తారెడ్డి

అనంతపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ వన్డే ఆంధ్రా జట్టు ఎంపిక కోసం నిర్వహిస్తున్న ప్రాబబుల్స్ పోటీల్లో అనంతపురం జిల్లాకు చెందిన రంజీ క్రీడాకారుడు మచ్చా దత్తారెడ్డి సత్తా చాటాడు. 60 బంతుల్లో 10 సిక్సర్లు, 11 ఫోర్లతో 127 పరుగులతో చెలరేగాడు. ప్రాబబుల్స్ పోటీలు విజయనగరంలో నిర్వహిస్తున్నారు. టీమ్–డీ, టీమ్– సీ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంపిక చేసుకున్న టీమ్–డీ 9 వికెట్ల నష్టానికి 260 పరుగుల భారీ స్కోరు చేసింది. (వర్షం కారణంగా మ్యాచ్‌ను 26 ఓవర్లకు కుదించారు). మచ్చా దత్తారెడ్డి టీమ్–డీ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన టీమ్–సీ జట్టు 166 పరుగులు మాత్రమే చేసింది. టీమ్–డీ 94 పరుగులతో భారీ విజయం సాధించింది.

సాయం చేయబోయి మృత్యువాత

- రోడ్డు ప్రమాదంలో బొలెరో డ్రైవర్ దుర్మరణం



నరసింహులు (ఫైల్)

గార్లదిన్నె: తోటి డ్రైవర్ పడుతున్న ఇబ్బంది చూసి టైరు మార్చేందుకు సాయం చేయడానికి వెళ్లిన బొలెరో డ్రైవర్‌ను రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. కర్నూలు జిల్లాలో ఈ సంఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గార్లదిన్నె మండలం సంజీవపురానికి చెందిన నరసింహులు (32) బొలెరో వాహనం నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేడు. గురువారం కళ్యాణదుర్గం నుంచి బీరకాయల లోడ్‌తో హైదరాబాద్ మార్కెట్‌కు బయల్దేరాడు. శుక్రవారం అన్‌లోడ్ చేశాడు. అనంతరం ఎరువులు లోడ్ చేసుకుని కర్నూలు జిల్లా బేతంచెర్లకు వస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున కోదండపూర్ సమీపంలోకి రాగానే అప్పటికే అక్కడ మరొక బొలెరో వాహనం టైరు పంక్చర్ అవడంతో రోడ్డు పక్కన ఆపారు. టైరు మార్చేందుకు డ్రైవర్ ఇబ్బంది పడుతుంటే నరసింహులు సహాయం చేసేందుకు ముందుకు వచ్చాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన ఐషర్ వాహనం ఢీకొనడంతో నరసింహులు అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

అనంతపురం: నగరంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జ్ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. మరువకొమ్మ కాలనీకి చెందిన కటిక మహమ్మద్ సాజిద్ అలియాస్ సాదిక్, ఉమానగర్‌కు చెందిన వనం శివ చరణ్ అలియాస్ టాటూ చరణ్ ఆర్టీఓ కార్యాలయం, భైరవనగర్ సర్కిల్ గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. వీరి వద్ద నుంచి కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిరంతర నిఘా తప్పనిసరి



ఈవీఎం గోదామును తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి

అనంతపురం అర్బన్: ఈవీఎంల గోదాముల వద్ద నిరంతర నిఘా తప్పనిసరిగా ఉండాలని ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. పాత ఆర్‌డీఓ కార్యాలయ ఆవరణలోని గోదాముల్లో భద్రపరిచిన ఈవీఎంలను శనివారం తనిఖీ చేశారు. అక్కడి భద్రతాచర్యలు, లాగ్‌బుక్‌ను పరిశీలించారు. భద్రత విషయంలో రాజీపడ వద్దని సూచించారు. సీసీ కెమెరాలు నిరంతరాయంగా పని చేయాలన్నారు. అపరిచిత వ్యక్తుల సంచారం లేకుండా చూసుకోవాలని చెప్పారు. అప్రమత్తంగా ఉంటూ బందోబస్తు నిర్వహించాలని పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో కో–ఆర్డినేషన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, తహసీల్దార్ హరికుమార్, ఎన్నికల విభాగం డీటీ కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ కార్యదర్శి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి కాల పరిమితి ముగిసినందున 2025–26 నుంచి 2026–27 వరకు రెండేళ్ల పాటు ఈ పోస్టులో కొనసాగేందుకు అర్హులైన పాఠశాల సహాయకులు (ఫిజికల్ డైరెక్టర్లు), పీఈటీలు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు తెలిపారు. శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 58 ఏళ్లలోపు వయసు, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి, ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న అర్హులైన పీడీ, పీఈటీలు దరఖాస్తులను ఆగస్టు 6లోగా డీఈఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

శ్రీసాయి డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో కళాశాల యాజమాన్యం

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కమలా నగర్‌లోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్ మేళా నిర్వహించారు. దాదాపు 60 మంది నిరుద్యోగ అభ్యర్థులు హాజరయ్యారు. వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన ఐదుగురికి నియామక పత్రాలు అందజేశారు. వీరిని కళాశాల చైర్మన్ రాజేంద్ర ప్రసాద్, ప్రిన్సిపల్ పి.దామోదర రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ విజయ్ కుమార్, అధ్యాపకులు షెక్షావలి, జ్యోతిక, వెంకటేశులు, వెంకన్న, చలపతి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో పట్టుబడిన అల్యూమినియం, కాపర్



కళ్యాణదుర్గం ఆర్టీసీ బస్సులో అధికారులు గుర్తించిన అల్యూమినియం, కాపర్ సంచులు

ఉరవకొండ: ఆర్టీసీ బస్సులో గుట్టుచప్పుడు కాకుండా రవాణా చేస్తున్న అల్యూమినియం (సిల్వర్), కాపర్ ముడిసరుకును ఉరవకొండ డిపో వద్ద వాణిజ్య పన్నుల శాఖ అధికారులు శనివారం పట్టుకున్నారు. కళ్యాణదుర్గం డిపో ఆర్టీసీ సర్వీసులో కళ్యాణదుర్గం నుంచి హైదరాబాద్‌కు అల్యూమినియం, కాపర్ టన్ను బరువు ఉన్న ముద్దలను 20 సంచుల్లో నింపి తరలిస్తుండగా, పక్కా సమాచారంతో వాణిజ్య పన్నుల శాఖ డీసీటీఓ సురేష్ సిబ్బందితో కలిసి ఉరవకొండ డిపోలో పట్టుకున్నారు.

- నగరంలో తూతూమంత్రంగా ప్యాచ్ వర్క్స్
- అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం
- ఈ ఏడాది మార్చిలో రూ.47 లక్షలతో 275 గుంతలకు ప్యాచ్‌లు
- నెలలు గడవకముందే తేలిపోయిన వైనం
- రూ.లక్షల ప్రజాధనం వృథా



సప్తగిరి సర్కిల్‌లో గుంతలు పడిన దృశ్యం



రజక్‌నగర్ ప్రధాన రోడ్డు గుంతలమయం



తారు లేచిపోవడంతో ఏర్పడిన గుంత

నాణ్యత నగుబాటు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత కరువైంది. రూ.లక్షల ప్రజాధనంతో చేపట్టిన ప్యాచ్ వర్క్స్ చేపట్టారు. పనులు నాణ్యతగా చేపట్టకపోవడంతో మళ్లీ గుంతలు దర్శనమిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కొద్ది రోజులకే నాణ్యతా లోపాలు బయటపడుతున్నాయి. గుంతల్లో తారు లేచిపోయి గోతులు యథావిధిగా దర్శనమిస్తున్నాయి. నెలలు గడవకముందే గుంతలు పడటంతో వాహనదారులు, ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు పడిన రోడ్ల మధ్య వెళ్తున్న సమయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పనులు జరిగే సమయంలో ఇంజినీర్లు బాధ్యతగా వ్యవహరించి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదని నగరపాలక సంస్థ వర్గాలు అంటున్నాయి.

ప్యాచ్.. అంతా తూచ్

నగరంలోని 50 డివిజన్లకు సంబంధించి 74 సచివాలయాల పరిధిలోని విద్యుత్ నగర్, సాయి నగర్, అశోక్ నగర్, నాయక్ నగర్, సప్తగిరి సర్కిల్, సుభాష్ రోడ్డు, ఆర్ట్స్ కళాశాల, సోమనాథ్ నగర్, రంగస్వామి నగర్, 5, 6 వ రోడ్లు, తిలక్ రోడ్డు, నీరుగంటి వీధి, ఆర్ఎఫ్ రోడ్డు, బస్టాండ్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో రోడ్లపై భారీగా గుంతలు ఏర్పడ్డాయి. ఈ ఏడాది జనవరిలో రెండు టెండర్లకు సంబంధించి రూ.47 లక్షల నిధులతో 275 గుంతలకు ప్యాచ్ వర్క్‌లు చేపట్టాలని నిర్ణయించారు. మార్చిలో పనులు ప్రారంభించారు. దీని ప్రభావంతో నెలల వ్యవధిలోనే మరోసారి అన్ని ప్రాంతాల్లో గుంతలు పడ్డాయి. రోడ్డుపై ఎక్కాంటే ఒడిదుడుకులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు మధ్యలో గుంతలు ఉండడంతో ప్రజలు అంచనా వేయలేని పరిస్థితి. పొరపాటున పడితే గాయాల పాలయ్యే అవకాశం లేకపోలేదు. అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారనుంది.

ఇంజినీర్ల నిర్లక్ష్యం..

నగరపాలక సంస్థలో ఇద్దరు కీలక ఇంజినీర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓ ఈఈ స్థాయి అధికారి ఎప్పుడు గంటలకొద్దీ మాటలు చెబుతూ సందు దొరికితే నీటి పనుల పేరుతో కార్యాలయానికి రావడం మానేశారు. ఇక మరో ఈఈ స్థాయి అధికారి ఏం చెప్పినా కాంట్రాక్టర్లను వెనుకేసుకు వస్తూ చిన్న నవ్వు నవ్వి వెళ్లిపోతుంటారు. పనులు జరిగే సమయంలో ఏనాడు వీరిద్దరూ పర్యవేక్షించిన దాఖలాలు లేవు. కనీసం ఏఈ, ఎమినిటీలను అయినా పనులు జరిగే ప్రాంతంలో ఉంచారా? అంటే అదీ లేదు. తమకేం పట్టదన్న ధోరణిలో వారు వ్యవహరించారు. వీరి నిర్వాకంతో రూ.లక్షల ప్రజాధనంతో చేపడుతున్న పనుల్లో నాణ్యత లోపించే అవకాశం ఉందని నగరపాలక సంస్థ వర్గాలు చర్చించుకుంటున్నాయి.



రంగస్వామి నగర్ నుంచి తపోవనం వెళ్లే మార్గంలో కంకర వేసి వదిలేసిన దృశ్యం

ఫ్లెక్సీలపై రాజకీయం చేస్తారా?



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థకు పన్ను చెల్లించి ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకుంటే దాన్ని కూటమి నేతలు రాజకీయం చేస్తున్నారు. అందుకు టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్, టీపీఓ శిరీష వత్తాసు పలుకుతున్నారు. వీరు ఉద్యోగాలు మానుకుని రాజకీయాల్లోకి వస్తే బాగుంటుందని మేయర్ వసీం సూచించారు. శనివారం వైఎస్సార్ సీపీ నాయకుడు తబ్రేజ్ తన జన్మదినాన్ని పురస్కరించుకుని ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకోగా దాన్ని టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. దీనిపై మేయర్ స్పందించారు. నగరంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఫ్లెక్సీలు ఏవి వేసినా తొలగిస్తున్నారన్నారు. ఇదే విషయమై సీఐ శ్రీకాంత్ యాదవ్‌కు మేయర్ వసీం ఫోన్ చేయగా ప్రొసీడింగ్ ఉండాలని చెప్పారు. నగరపాలక సంస్థకు చలానా కట్టాక ప్రొసీడింగ్స్ ఎందుకుని.. ఇప్పుడు నగరంలో వేస్తున్న ప్రతి ఫ్లెక్సీకి ప్రొసీడింగ్ ఉండాలా అని ప్రశ్నించారు. మేయర్ వెంట కార్పొరేటర్ కమల్ భూషణ్, వైఎస్సార్ సీపీ నాయకులు కమర్‌తాజ్ తదితరులు ఉన్నారు.

స్పెషల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి చర్యలు

- ఎట్టకేలకు దరఖాస్తుల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి వచ్చిన దరఖాస్తుల స్క్రూటినీలో కదలిక వచ్చింది. ఓవైపు ప్రజాప్రతినిధుల నుంచి వస్తున్న తీవ్ర ఒత్తిళ్లతో దరఖాస్తులను పరిశీలించాలంటే సమగ్రశిక్ష అధికారులు వణికిపోతున్న వైనంపై ఇటీవల 'సాక్షి'లో 'మా వాళ్లకు ఇవ్వకుంటే ఇక మీ ఇష్టం' శీర్షికతో వెలువడిన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు, సమగ్రశిక్ష ఎస్పీడీ కార్యాలయ అధికారులు జోక్యం చేసుకుని ఆదేశాలు జారీ చేశారు. వీలైనంత త్వరగా దరఖాస్తులను స్క్రూటినీ చేసి ఇంటర్వ్యూలు నిర్వహించి పోస్టులు భర్తీ చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో శనివారం కలెక్టరేట్‌లో దరఖాస్తుల స్క్రూటినీ చేపట్టారు. సమగ్రశిక్ష ఏపీసీ శైలజ, గుత్తి డీవైఈఓ మల్లారెడ్డి ఆధ్వర్యంలో పలువురు హెచ్ఎంలు ఈ ప్రక్రియలో పాల్గొన్నారు. మొత్తం 6 సెక్టోరియల్ అధికారుల పోస్టులకు 172 దరఖాస్తులు అందాయి. ఇందులో పీజీ అర్హత లేని, శ్రీసత్యసాయి జిల్లాలో పని చేస్తూ ఇక్కడ దరఖాస్తు చేసుకున్న వారివి మాత్రమే తిరస్కరించారు. తక్కిన అన్ని దరఖాస్తులకు దాదాపు ఆమోదం తెలిపినట్లే అని తెలిసింది. రెండు మూడు రోజుల్లో విద్యార్హతలకు సంబంధించిన మార్కులు కేటాయించి, ఆ తర్వాత ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఆశావాహుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే కొందరు, ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు తెచ్చుకున్నారు. వారికి ఇంటర్వ్యూల్లో కలిపే మార్కులపై ఆందోళన చెందుతున్నారు.

'లోకల్, నాన్-లోకల్' నిబంధనలతో ఇబ్బందులు

అనంతపురం ఎడ్యుకేషన్: డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాలు మొదలైన సమయంలో కొత్తగా తీసుకొచ్చిన లోకల్, నాన్-లోకల్ నిబంధనలు విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతాయని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పీడీఎస్ఓ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఉన్నత విద్య, వృత్తి విద్యా కోర్సుల ప్రవేశాలు, ఉమ్మడి ప్రవేశ పరీక్షల నిబంధనలను స్పష్టం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇంజినీరింగ్, మెడికల్, ఫార్మసీ కోర్సుల్లో 15 శాతం నాన్-లోకల్ కోటాను రద్దు చేసి అన్ని సీట్లను లోకల్ విద్యార్థులకు కేటాయించారన్నారు. ఈ నిబంధన ప్రకారం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలతో కూడిన ఆంధ్ర విశ్వవిద్యాలయం రీజియన్, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు జిల్లాలతో కూడిన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం రీజియన్‌లలో 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగు సంవత్సరాలు చదివిన విద్యార్థులు మాత్రమే లోకల్‌గా పరిగణించబడతారన్నారు. అయితే ఎస్వీయూ రీజియన్ నుంచి విజయవాడ (ఏయూ రీజియన్)లో ఇంటర్ చదివిన వేలాది విద్యార్థులు రెండు ప్రాంతాల్లోనూ నాన్-లోకల్‌గా వర్గీకరించబడుతున్నారని వాపోయాడు. ర్యాంకులు సాధించిన వారు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటికే ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు.

దళితులంటే అంత చులకనా?



మాట్లాడుతున్న ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు

ఆత్మకూరు: దళితులంటే పరిటాల కుటుంబానికి అంత చులకనా? అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆత్మకూరులో దళితులకు కేటాయించిన కమ్యూనిటీ భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. దళితల అభివృద్ధికి ఎమ్మెల్యే పరిటాల సునీత అడుగడుగునా అడ్డుపడుతున్నారన్నారు. దళితులంటే పరిటాల కుటుంబానికి ఎందుకంత పగ అని ప్రశ్నించారు. ఆత్మకూరు మండలంలో ఎస్సీ కమ్యూనిటీ భవనం నిర్మించాలన్న ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భూమి పూజ చేశారన్నారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం రావడంతో ఆ పనులు ఆగిపోయాయన్నారు. మండల సమావేశంలో ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి తీర్మానాలు సిద్ధం చేస్తే.. వాటిని ప్రవేశ పెట్టనివ్వకుండా ఎమ్మెల్యే సునీత తన అనుచరులను సమావేశంలోకి పంపి భవన నిర్మాణం జరగకుండా అడ్డుకున్నట్లు తెలిపారు. దళితులు ఎదగకుండా పరిటాల కుటుంబం అడ్డుకుంటోందన్నారు. ఇది అంబేడ్కర్ రాజ్యాంగమా ? పరిటాల రాజ్యాంగమా ? అని మండిపడ్డారు. ఇక మండల సమావేశంలో ఎంపీపీని టీడీపీ నేతలు దుర్భషలాడుతూ భయభ్రాంతులకు గురి చేయడం సిగ్గు చేటన్నారు. ఎంపీడీఓ విజయలక్ష్మి టీడీపీ నేతలకు మద్దతుగా మాట్లాడటం సరికాదన్నారు. రాబోవు రోజుల్లో దళితులు అందరూ కలసి కూటమికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. బాధ్యతారహితంగా వ్యవహరించిన ఎంపీడీఓ, సమావేశాన్ని అడ్డుకున్న టీడీపీ నేతలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఓబులేసు, ఎంపీపీల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు సుబ్బర హేమలత, ఆత్మకూరు సర్పంచ్ వరలక్ష్మి, దళిత సంఘం నాయకులు వన్నూరప్ప, రామాంజి, వెంకటేష్, సుబ్బరాయుడు, ఈశ్వరయ్య, ఓబులేసు, శ్రీరాములు, హనుమంతు, వార్డు మెంబర్ పెద్దన్న, ఓబుళప్ప, ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అందరికీ సంక్షేమం



5వ డివిజన్‌లో కూటమి మోసాలను వివరిస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా జగనన్న సంక్షేమాన్ని అందించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో విఫలమైందని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం 5వ డివిజన్‌లో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా స్థానిక కార్పొరేటర్ జయలలితతో కలసి చంద్రబాబు మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. అమ్మఒడి, చేయూత, ఆసరా, రైతు భరోసా తదితర పథకాలతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద ప్రజలు ఆర్థికంగా ప్రగతి సాధించేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అవైజ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

24వ డివిజన్‌లో..

నగరంలోని 24వ డివిజన్‌లో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సంపంగి రామాంజనేయులు, నాయకులు నాగేంద్ర, గుజ్జల శ్రీరాములు, గుజ్జల నారాయణ, మధుసూదన్ రెడ్డి, సాకే శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంఓ, వైద్యుల సీళ్లు మాయం

అనంతపురం మెడికల్: ప్రభుత్వం సర్వజనాస్పత్రిలో దొంగలు పడ్డారు. రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్ (ఆర్ఎంఓ), అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సర్జరీ ప్రొఫెసర్, మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ల సీళ్లు మాయమయ్యాయి. శనివారం ఉదయం ఆర్ఎంఓ గదిలోకి ఓ యువకుడు వచ్చి వెళ్లిన వెంటనే సీళ్లు కనిపించలేదు. అలాగే క్యాజువాలిటీలోని ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల సీళ్లు కూడా మాయం కావడంతో వైద్యులు నివ్వెరపోయారు. వాస్తవంగా వివిధ సర్టిఫికెట్ల మంజూరుకు సంబంధిత సీలు వేసి దానిపై గ్రీన్ పెన్‌తో సంతకం చేస్తారు. తద్వారా వైద్య సేవలతో పాటు ఏవైనా సిక్ లీవ్స్, ఎంఆర్ఐ, సీటీ స్కాన్‌లు చేసుకునేందుకు వీలుగా ఉంటుంది. కాగా అటువంటి కీలక సీళ్లను కొట్టేడయం ఆస్పత్రిలో కలకలం రేపింది. ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యులు డాక్టర్ నూరుల్లా, డాక్టర్ మహేష్‌లు ఆస్పత్రిలో సీసీ ఫూటేజ్‌ను పరిశీలించారు. దీనిపై సూపరింటెండెంట్ ఆత్మరాం సీరియస్‌గా పరిగణించారు. ఆస్పత్రిలోని సీసీ ఫుటేజీలను పరిశీలించి.. ఆస్పత్రిలో విధులు నిర్వర్తించే విద్యార్థి సీళ్లను చోరీ చేసినట్లు నిర్ధారణకు వచ్చారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



క్లాక్ టవర్ వద్ద మాజీ సైనికుల ర్యాలీ

అనంతపురం: మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ దూదేకుల షేకన్న ఆధ్వర్యంలో శనివారం నగరంలో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నుంచి ఎన్టీఆర్ సర్కిల్, టవర్‌క్లాక్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, డాక్టర్ బృందా, విష్ణుప్రియ, మాజీ సైనికుల సంఘం ప్రధాన కార్యదర్శి పట్నం ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ తిమ్మారెడ్డి, రాంగోపాల్, నాగరాజు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కల్చరల్: విజయ్ దివస్ సందర్భంగా హిందూ చైతన్య వేదిక, మై భారత్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. యువతకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

సంక్షిప్త సమాచారం

మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం టౌన్: విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలను పరిష్కరించి, వారిని ఏపీఎస్పీడీసీఎల్ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ నాయకుడు రాజారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలపై విద్యుత్ శాఖ ఏఓకు వినతిపత్రం అందజేశారు. చాలమంది రీడర్స్‌కు రెండు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని తెలిపారు. పలుమార్లు విద్యుత్ శాఖ ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లిన ఏమాత్రం స్పందించలేదన్నారు. బకాయి వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించి సంస్థ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

రాప్తాడు: గాండ్లపర్తి గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ తోటలో పేకాట ఆడుతున్న 7 మంది పేకాట రాయుళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.3,700 నగదు, మొబైల్స్, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన పేకాట రాయుళ్లు గాండ్లపర్తి, జి.కొత్తపల్లి గ్రామాలకు చెందిన వారేనని సీఐ శ్రీహర్ష తెలిపారు.

టీకేఎస్ ఇన్సాఫ్ కమిటీ ఎన్నిక

అనంతపురం అర్బన్: నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో శనివారం ఆ పార్టీ బుక్కరాయసముద్రం మండల కార్యదర్శి మల్లిస్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుక్కరాయసముద్రం మండలం సీపీఐ మైనారిటీ విభాగం ఇన్సాఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఇన్సాఫ్ అధ్యక్షుడిగా బాబాఫకృద్దీన్, ప్రధాన కార్యదర్శిగా ఖలీల్, ఉపాధ్యక్షుడిగా మైనుద్దీన్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఇన్సాఫ్ నగర అధ్యక్షుడు చాంద్‌బాషా, ప్రధాన కార్యదర్శి ఖాజాహుసేన్, ఉపాధ్యక్షుడు అల్లీపీరా పాల్గొన్నారు.

వివరాల నమోదు వేగవంతం చేయండి

రాప్తాడు: పంచాయతీలో ఇంటి పన్నులకు సంబంధించిన డేటాను ఈనెలా 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఈఓఆర్డీ ఆనంద ప్రసాద్ తెలిపారు. శనివారం రాప్తాడులో గ్రామ సచివాలయం–1ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గతంలో ఇంటి పన్నులు కట్టిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌లో మండల వ్యాప్తంగా ఇంటి పన్నులకు సంబంధించిన డేటాను ఆన్‌లైన్‌లో వ్యూరిఫికేషన్ చేస్తున్నామన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

అనంతపురం కల్చరల్: శ్రావణ మాసంలో వచ్చిన తొలి శనివారం కావడంతో పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. నగర శివారులోని శ్రీ శివబాలయోగి ఆశ్రమం భక్తులతో కిటకిటలాడింది. ఆశ్రమ అధ్యక్షుడు అరవింద్, రత్నగిరి దేవరాజ్ ఆధ్వర్యంలో సామూహిక గోమహాలక్ష్మి పూజలు, తిరుమంజనం కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్ఎఫ్ రోడ్డు, హౌసింగ్ బోర్డు, రామనగర్, తదితర చోట్ల ఏడు శనివారాల వ్రతాలు జరిగాయి.


తలకిందులవ్వాల్సిందే..



ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని క్యాజువాలిటీ వార్డులో మంచాలు లేకపోవడంతో రోగుల అవస్థలు

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని క్యాజువాలిటీలో సరిపడా మంచాలు లేక రోగులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. శనివారం సర్వజనాస్పత్రిలో మంచాలు లేకపోవడంతో ఒకే మంచంపై పురుషుడు, మహిళలను ఉంచేశారు. మహిళలు అసౌకర్యంగా ఇబ్బంది పడుతున్నారు. ఆస్పత్రిలోని క్యాజువాలిటీ, అక్యూట్ మెడికల్ కేర్‌లో పడకల సామర్థ్యం పెంచడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే తమ బంధువులో, మిత్రులో ఆస్పత్రికి వచ్చినప్పుడు ఇలా ఒకే మంచంలో ఇద్దరిని ఉంచి సేవలందిస్తే ఒప్పుకుంటారా? అని రోగులు ప్రశ్నిస్తున్నారు. – అనంతపురం మెడికల్:

ఇష్టారాజ్యంగా విధులు



ఇళ్లకు బయలుదేరిన హెడ్‌సిస్టర్లు

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పర్యవేక్షకుల బాధ్యతారాహిత్యం హెడ్‌సిస్టర్లకు వరంగా మారుతోంది. శనివారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఉదయం షిఫ్ట్‌లో ఉండే హెడ్‌సిస్టర్లు మధ్యాహ్నం 1 గంట నుంచి 1:30 గంటల మధ్యలో అధిక సంఖ్యలో ఇళ్లకు వెళ్లిపోయారు. వాస్తవంగా హెడ్‌సిస్టర్లు ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు, రాత్రి 8 గంటల నుంచి మరుసటి రోజు 8 గంటల వరకు విధుల్లో ఉండాలి. అయితే అధిక సంఖ్యలో హెడ్‌సిస్టర్లు ఉదయం సమయపాలన పాటించకుండా బయోమెట్రిక్ వేసుకోవడం, మధ్యాహ్నం త్వరగా ఇళ్లకు వెళ్లిపోతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. –అనంతపురం మెడికల్:

సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్

అనంతపురం: అసాంఘిక కార్యకలాపాలు, నేరాలను అరికట్టేందుకు శనివారం జిల్లాలోని పలు సమస్యాత్మక గ్రామాలు, కాలనీల్లో ఆయా పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఫుట్‌పెట్రోలింగ్, గ్రామస్తులతో సమావేశాలు నిర్వహించి గంజాయి, అనర్థాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, శక్తి యాపిల్, డయల్–100, సీసీ కెమెరాల ప్రాముఖ్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అక్రమ మద్యం జోలికెళితే చర్యలు తప్పవని హెచ్చరించారు. బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఆయా గ్రామాల్లో ప్రజలకు సూచించారు. పాత కేసుల్లో నిందితులతో సమావేశమై పాత పంథా కొనసాగించకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. పాత కేసుల్లోని నిందితుల ఇళ్లల్లో పశువుల పాకలు, గడ్డివాము, దుకాణాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు.